ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



మరింత మంది రైతులకు పంటల బీమా

- వేతన జీవులకు లభించని ఊరట
- సోలార్ విద్యుత్ గ్రిడ్‌తో శివార్లకు ఎక్కువ ప్రయోజనం
- ఆశా, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ వర్తింపు
- పీఎం ఆవాస్ యోజనతో ఎక్కువ మంది పేదలకు లబ్ధి
- ఉపాధి కూలీలకు నిరాశ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఆశించినంత ఆకర్షణీయంగా లేనప్పటికీ పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు రైతులకు మాత్రం కాసింత ప్రయోజకరంగా ఉంది. గతంతో పోలిస్తే మౌలిక సదుపాయాలు, తదితర రంగాలకు కేటాయింపులు పెంచినప్పటికీ మరికొన్ని రంగాలకు కేటాయింపులు తగ్గించేశారు. రైతులను పేదలను ఆకర్షించే విధంగా బడ్జెట్ ఉంది. పర్యాటక, హౌసింగ్ రంగాల అభివృద్ధికి నిధులు పెంచారు. పద్దుల్లో వేతన జీవులకు ఊరట కలిగించలేదు. పన్ను విధానాల్లో మార్పులకు కేంద్రం సముఖత చూపకపోవడం గమనార్హం. రైల్వేకి సంబంధించి కొత్త ప్రతిపాదనలు ఏవీ కార్యరూపం దాల్చలేదు. మధ్యంతర బడ్జెట్ కావడంతో వీటి జోలికి ప్రభుత్వం వెళ్లలేదు.

వేతన జీవులకు ఊరట కరువు



పన్నుల విషయంలో మరింత ఊరట ఉంటుందని వేతన జీవులు భావించారు. అయితే, పన్ను విధానాల్లో ఎలాంటి మార్పులూ చేయలేదు. అయితే, కొన్ని వివాదాస్పదమైన ప్రత్యక్ష పన్నుల డిమాండ్లను ఉపసంహరించుకున్నారు. దీని వల్ల అనేక మంది పన్ను చెల్లింపుదార్లకు కొంత ప్రయోజనం కలగనుంది.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అందరికీ ఆనందాన్ని పంచలేక పోయింది. కొన్ని వర్గాలకు కాస్త ఊరట లభించనుండగా, మరి కొన్ని వర్గాలను నిరుత్సాహానికి గురిచేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే, తీరా బడ్జెట్‌ను చూస్తే ఎక్కువ మందిని నిరాశకే గురి చేసింది. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఉసూరుమనిపించిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా పేదలకు కూలి పనులు కల్పించే ఉపాధి హామీ పథకానికి ఐదు శాతం నిధులు తగ్గించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోదం.. ఖేదం!



సొంతింటి కలకు ప్రోత్సాహం

హౌసింగ్ ఫర్ మిడిల్ క్లాస్ పేరుతో ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణానికి ప్రోత్సాహం అందించేందుకు హౌసింగ్ స్కీమ్ తీసుకువచ్చారు. మహిళలను లక్షాధికారులను చేసేందుకు అమలు చేస్తున్న లక్‌పతి దీదీ పథకానికి నిధులు పెంచారు. దీంతో ఈ పథకం కింద మరింత మందికి ప్రయోజనం కలగనుంది.

పర్యాటక రంగానికి ఊతం

పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్రాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని అనంతగిరి, కీసర వంటి పర్యాటక ప్రాంతాలకు మేలు జరగనుంది.



పెరగనున్న సోలార్ విద్యుత్తు ఉత్పత్తి



పీఎం సూర్యోదయ యోజన కింద సోలార్ వాడకాన్ని మరింత పెంచనున్నారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా కోటి ఇళ్లకు 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.8500 కోట్లతో గ్రిడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాలో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకం వల్ల నగర శివార్లలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం నగర శివార్లలో 10వేలకు పైగా సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఉన్నాయి. నగర శివార్లలో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు కొత్తగా వస్తున్నందున ఈ పథకాన్ని ఎక్కువ మంది వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

వ్యవసాయానికి స్వల్ప కేటాయింపులు



వ్యవసాయానికి ఈ సారి స్వల్పంగా కేటాయింపులు పెంచారు. అయితే యూరియాపై సబ్సిడీ మాత్రం గణనీయంగా తగ్గించారు. నానో యూరియా మాదిరిగానే నానో డీఏపీ అందజేస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పది లక్షల మందికి పైగా రైతులకు ఊరట కలగనుంది. పాడిపంటల ప్రోత్సాహానికి సమగ్ర కార్యక్రమం చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ పథకాల ద్వారా మరింత మందికి మేలు

కీలక పథకాలకు గత ఏడాదితో పోలిస్తే నిధులు పెంచారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా వచ్చే అయిదేళ్లలో రెండు కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. బస్తీలు, అద్దె ఇళ్లలో ఉండే వారికి పీఎం ఆవాస్ యోజన కింద ఈ ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకు అనుగుణంగా నిధులు పెంచారు. దీంతో ఈ పథకం కింద ఈ ఏడాది ఎక్కువ మంది పేదలకు లబ్ధి చేకూరనుంచి. ఇక తాగునీటి సమస్యల పరిష్కారం కోసం గణనీయంగా నిధులు పెంచారు. అలాగే పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, అన్నదాత సంరక్షణ యోజన పథకాలకు నిధులు భారీగా పెంచారు.

ఉపాధి పథకానికి దెబ్బ



మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు తగ్గించారు. దీంతో ఉపాధి పనులపై ఆధారపడిన పేదలపై ప్రభావం పడనుంది. గతంతో పోలిస్తే దాదాపు 5శాతం నిధులు తగ్గించారు. అలాగే పాటు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం నిధులు కూడా పెంచలేదు.

ఎవరేమన్నారంటే..

అంకెల గారడీయే



కేంద్ర బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. తాత్కాలిక బడ్జెట్‌లో ఏమీ ఉండదు. కేవలం రెండు నెలల బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్ ఎన్నికల స్టంటే! ఇది పేదల వ్యతిరేక బడ్జెట్. ఏటా కోటి ఉద్యోగాల హామీని విస్మరించారు. వ్యవసాయం, రైతు సంక్షేమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. సాగునీటి జలాల కేటాయింపుపై వివక్ష చూపారు.

-రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే

కొత్తదనం లేదు



బడ్జెట్‌లో కొత్తదనమేమీ లేదు. అప్పటి సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలే కేంద్ర బడ్జెట్ లోనూ కనిపిస్తున్నాయి. నిర్మలది పేదల వ్యతిరేక బడ్జెట్. వ్యవసాయ రంగానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. విద్య, వైద్య రంగాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు.

- కె.మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పరిగి

పేదలకు ప్రయోజనం చేకూర్చని బడ్జెట్



ఈ బడ్జెట్‌తో నిరుపేదలకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. బడా వ్యాపారులకు మేలు చేసేలా బడ్జెట్‌ను తయారు చేశారు. మైనార్టీలకుక అంతంత మాత్రంగా నిధులు కేటాయించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన నిధులు కేటాయించలేదు.

- సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు

మహిళలకు ఎలాంటి ప్రయోజనాలూ లేవు



కేంద్ర బడ్జెట్‌తో మహిళలకు ఎలాంటి ప్రయోజనాలు కలిగేలా లేవు. అన్ని రంగాల మాదిరిగానే మహిళా రంగాలకు కూడా మొండిచేయి చూపారు. వంట గ్యాస్ ధర తగ్గించి ఉంటే బాగుండేది. మహిళా సంఘాలకు, మహిళా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు వంటివేమీ ప్రకటించలేదు.

- శైలజ విజయేందర్‌రెడ్డి, జడ్పీటీసీ, మేడ్చల్

కొత్త సీసాలో పాత సారా..



కేంద్ర బడ్జెట్ కొత్త సీసాలో పాత సారాలా ఉంది. పెద్దగా ప్రజలకు లాభం చేకూర్చేది కాదు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు, కార్మికులకు నిరుద్యోగులకు పెద్దగా కేటాయింపులు లేవు. కార్పొరేట్లకు మేలు చేసేలా బడ్జెట్ ఉంది. గత బడ్జెట్ కంటే కేటాయింపులు పెద్దగాలేవు. నిత్యావసర ధరల నియంత్రణపై చర్యల్లేవు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోలేదు. పేదరిక నిర్మూలనకు చర్యలు లేవు.

- రాంచందర్, సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు

వేతన జీవులకు మొండిచెయ్యి



బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపులు పెంచకపోవడంతో వేతన జీవులకు నిరాశే మిగిలింది. సెక్షన్ 80(సి) కింద 1.5 లక్షలుగా ఉన్న మినహాయింపులను రూ.5లక్షలకైనా పెంచుతారని ఆశలతో ఉన్న వేతన జీవులపై కేంద్రం నీళ్లు చల్లింది. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2.5లక్షలుగా ఉన్న స్టాండర్డ్ తగ్గింపులను రూ.5లక్షలకు పెంచితే బాగుండేది.

- ఏవీ.సుధాకర్, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి

ఇది ఎన్నికల బడ్జెట్



బడ్జెట్ పూర్తిగా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ గెలవాలనే బడ్జెట్ రూపకల్పన చేసినట్టుంది. బడ్జెట్ పథకాలు రైతు, బడుగు వర్గాలకు, అసంఘటిత కార్మికులకు మేలు చేయని బడ్జెట్ ఇది. అంగన్వాడీలను, ఆశా వర్కర్లను, భోజన కార్మికులను రెగ్యులరైజ్ చేయకపోవడం విచారకరం. విద్య, వైద్యాలకు కేటాయింపులు సరిపోవు.

- విజయలక్ష్మీపండిత్, సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరం



బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంది. యువ, పేద, మహిళలు, రైతులు అందరికీ సాధికారత చేకూర్చేలా ఉంది. 2013-14లో ఆదాయపు పన్ను పరిమితి 2.2లక్షల వరకు ఉండేది. మోదీ ప్రభుత్వ వచ్చాక దీనిని రూ.7లక్షలకు పెంచారు. ఆయుష్మాన్ భారత్ కింద రూ.7,500కోట్లు ప్రకటించడం హర్షణీయం, తెలంగాణలో రైల్వేకు రూ.5,071కోట్లు ప్రకటించారు.

- బొక్కనర్సింహారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

నాయకులు విలువలకు కట్టుబడి పనిచేయాలి

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- ఇబ్రహీంపట్నంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1 : నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పనిచేసే వారికి ఏదో ఒక సమయంలో గుర్తింపు వస్తుందని, రాజకీయంగా అవకాశం వచ్చినవారు విలువలకు కట్టుబడి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్స్‌లో గవర్నర్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సహా పలు హిందూ, యువజన సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 1979-80లో తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేసినప్పుడు కొన్నిచోట్ల తనను ప్రచారానికి రాకుండా కొందరు అడ్డుపడ్డారని గుర్తుచేశారు. అప్పటికీ, ఇప్పటికీ రాజకీయంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఎవరు ఎక్కడనుంచైనా పోటీచేసే అవకాశం ఉందన్నారు. తనకు గవర్నర్‌గా అవకాశం వస్తుందని ఊహించింది కాదన్నారు. సిద్ధాంతం, విలువలకు కట్టుబడి పని చేసిన వారికి ఏదో ఓ రూపంలో అవకాశం వస్తుందనేది గుర్తెరగాలన్నారు. రాష్ట్రపతులుగా అత్యున్నత పదవులు పొందిన రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపది ముర్ములను ఇందుకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, వ్యవసాయ కార్మికులు ఇలా ఎవరి హక్కులు వారికుంటాయని, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిపై ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా ప్రజల అవసరాలను గుర్తించి గవర్నర్లు తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, దీనిని రాజకీయ కోణంలో చూడవద్దని అన్నారు. సామాజిక రుగ్మతలను రూపుమాపుతూనే డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాల్సి ఉందని గవర్నర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎంపీపీ సుకన్య, బీజేపీతో పాటు పలు సంఘాల నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, రావినూతల శశిధర్, లచ్చిరెడ్డి, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, దండె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు

ముగిసిన జలశక్తి అభియాన్
కేంద్ర బృందం పర్యటన

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 : గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు రోజుల పాటు జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు నిర్వహించిన పర్యటన ముగిసింది. ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో జలశక్తి అభియాన్ డిప్యూటీ సెక్రెటరీ అంకిత్ మిశ్రా మాట్లాడారు. జిల్లాలో జలశక్తి అభియాన్ ద్వారా నీటిని నిల్వ ఉంచే ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరు బావులు, చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వరి పంటలు, పండ్లు, పూల సాగు విధానాన్ని పరిశీలించామన్నారు. శాస్త్రవేత్త అంకిత్ విశ్వకర్మ మాట్లాడుతూ నీటి నిల్వలను పెంచుకోవడం కోసం జిల్లాలో అభివృద్ధి చేస్తున్న వ్యక్తిగత ఇంకుడు గుంతలను సందర్శించామని తెలిపారు. పలు గ్రామాల్లో నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, బృహత్ పల్లె ప్రకృతివనాల అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో దిలీప్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజ, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యాన శాఖ, అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారి బన్సీలాల్, మిషన్ భగీరథ అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో విదేశీ మహిళకు 14 ఏళ్ల జైలు

- రూ.లక్ష జరిమానా.. నిందితురాలు జాంబియా దేశస్థురాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 : అక్రమంగా డ్రగ్స్ తరలిస్తుండగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుబడిన ఓ విదేశీ మహిళకు ఎల్బీ నగర్ కోర్టు 14 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించింది. డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జాంబియా దేశానికి చెందిన ఓ మహిళ 2021 జూన్ 6న జాంబియా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా.. రూ.52.32 కోట్ల విలువచేసే 8050 గ్రాముల హెరాయిన్(డ్రగ్స్) స్వాధీనం పట్టుబడింది. అప్పట్లో డీఆర్ఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం సాక్ష్యాధారాలతో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ ఎంఎస్‌జే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న మెజిస్ట్రేట్ నేరం రుజువు కావడంతో గురువారం ఆ మహిళకు 14 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు.

నట్టల నివారణకు 'అల్బెండజోల్' మాత్రలు వాడాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1 : పిల్లల్లో నట్టల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈనెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినం పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలందరికీ నట్టల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులకు సగం మాత్ర స్పూన్ ద్వారా పొడిచేసి నీటితో వేయాలని, మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రమే వేయాలని సూచించారు. 2-3 సంవత్సరాల వారికి ఒక పూర్తి మాత్ర పొడిచేసి వేయాలని చెప్పారు. 3-19 సంవత్సరాల వయస్సు వారు చప్పరించి లేదా నమిలి మింగేటట్లు చూడాలన్నారు. ఇలా ఒకటి నుంచి 19 ఏళ్ల వారందరికీ, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లల్లో మట్టి ద్వారా నులిపురుగుల గుడ్లు పిల్లల చేతుల ద్వారా శరీరంలోకి చేరి నులిపురుగులుగా, ఏలిక పాములుగా, కొంకిపురుగులు అనే పరాన్న జీవులుగా పెరిగి పిల్లల్లో తీవ్ర పోషకారలోపం కలుగచేస్తాయని చెప్పారు. అదేవిధంగా రక్తహీనత, కడుపునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కలగచేస్తాయని అన్నారు. ఏడాదికి రెండుసార్లు అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లాకు 9 లక్షల మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రతికూల లేదా చెడు ప్రభావం ఏర్పడితే వెంటనే వైద్యసిబ్బందికి, దగ్గరలో ఉన్న వైద్యాధికారులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మామిడి పూత పచ్చని శోభను సంతరించుకుంది. ఆకులకన్నా పూతతోనే చెట్టు ఎంతో ఆకర్షణగా కనివిందు చేస్తోంది. మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్‌లోని ఎన్టీఆర్ విద్యాసంస్థల ఆవరణలో ఓ మామిడిచెట్టు పూత నిండుగా పూయడంతో అలంకరించినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది చెట్టు ఆకులు కనిపించనంతగా పూత పూసింది. ఉగాదికి ముందే మామిడి పూత విరబూసినట్లు కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 1

భూమిని కాపాడుకుందాం

వికారాబాద్, ఫిబ్రవరి 1: కర్బన ఉద్గారాలు పెరగడంతో భూమి వేడెక్కుతుందని, ఆ సందర్భంలో భూమిని కాపాడుకోవాలని పలువురు వక్తలు అన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ మామ్దాన్ పల్లి, కిష్టాపూర్ పాఠశాలల్లో 'పర్యావరణ సమతుల్యత, భూమిని కాలుష్య కోరల్లో నుంచి కాపాడడం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. లీడ్ ఎర్త్ లీడర్స్‌గా ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులకు బ్యాడ్జిలను అందించి, అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. హెచ్ఎం శ్రీ.రాంరెడ్డి, పాఠశాల యంగ్ ఎర్త్ లీడర్స్ ఇన్‌చార్జి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎన్ . ఇందిర, పి.హేమలత, కె.వరలక్ష్మి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జె.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులకు పంచాయతీ పవర్

● నేటి నుంచి బాధ్యతల స్వీకరణ ● స్వాగతం పలుకుతున్న సవాళ్లు

తాండూరు, ఫిబ్రవరి 1: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో నేటి(శుక్రవారం) నుంచి వివిధ గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు పలు సమస్యలు, సవాళ్ల మధ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలని కోరుతూ స్టేవిధించాలని పలువురు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించడంతో ప్రత్యేకాధికారుల పాలనకు లైన్‌క్లియర్ అయింది. దాంతో వారి చేతికి పంచాయతీ పవర్ వెళ్లనుంది. పెండింగ్ బిల్లుల చెల్లింపు, తాగునీటి, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపు, ఉపాధిహామీ పథకం అమలు, వంటివి కొత్తగా నియమితులయ్యే ప్రత్యేకాధికారులకు సవాల్‌గా మారనున్నాయి. చిన్నగ్రామ పంచాయతీలు నిధుల కొరతతో సతమతమవుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాల్లో కలిపి 153, సబ్‌డివిజన్ పరిధిలో బొంరాస్‌పేట్ మండలంలో 47, కొడంగల్‌లో 26, దౌల్తాబాద్‌లో 33, గ్రామ పంచాయతీలున్నాయి.

9 అంశాలపై పని చేయాలి

ప్రత్యేకాధికారులు 29 అంశాల ఆధారంగా పని చేయాలి. వాటిలో కేవలం 9 అంశాలు మాత్రమే పూర్తి స్థాయిలో పంచాయతీలకు బదాలాయించారు. విద్య, వైద్య , పశుసంవర్థక, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమం, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, డీఆర్‌డీఏ, విద్యుత్ శాఖలున్నాయి.

ప్రత్యేకాధికారుల బాధ్యతలివే

పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలి. పంచాయతీ స్థిరాస్తులు, ఆదాయ వనరులపై దృష్టి సారించాలి. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, విద్యుత్ సమస్యపై దృష్టి సారించి పర్యవేక్షించాలి. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పించాలి. గ్రామపంచాయతీ లెక్కలు, అభివృద్ధి పనులు చేయిస్తే ఎంబి రికార్డు చేయించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించాలి. బాధ్యతలు తీసుకున్న వెంటనే రికార్డులు, లాగిన్లను స్వాధీనం చేసుకొని, విలేజ్ ప్రొఫైల్ తయారు చేసుకోవాలి.

సిబ్బంది కొరత

కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలలో సిబ్బంది కొరత ఉంది. చాలా గ్రామాల్లో సర్పంచ్‌లు సొంత డబ్బులతో వేతనాలు చెల్లించి కార్మికులను కొనసాగించారు. మరికొన్ని చోట మల్టీపర్పస్ వర్కర్లుగా కొనసాగుతున్నారు. అవసరం మేరకు పారిశుధ్య, విద్యుత్ సిబ్బంది కొరత ఉంది.

బీజాపూర్ హైవే పనులకు గ్రీన్‌సిగ్నల్

● తక్షణమే పనులు చేపట్టాలని కేంద్రమంత్రి గడ్కరీ ఆదేశం

● తాండూరు - బీదర్, మన్నెగూడ- తాండూరు రోడ్ల విస్తరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): కొన్నాళ్లుగా నిలిచిపోయిన హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలని కేంద్రరోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కారీ ఉన్నతాధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులపై గురువారం రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రి గడ్కారీతో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా రీజినల్ రింగురోడ్డు పనులతో పాటు పలు పెండింగ్ పనులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న హైదరాబాద్-బీజాపూర్ హైవే విస్తరణ పనులను చేపట్టాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మనోహర్‌రెడ్డి కోరారు. పర్యవరణ అనుమతులు కూడా వచ్చాయని, దీనికి సంబంధించిన కోర్టు వివాదాలు కూడా పరిష్కారమైనట్లు వారు తెలిపారు. దీనిపై వెంటనే గడ్కారీ స్పందిస్తూ వెంటనే ఈపనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా తాండూరు నుంచి బీదర్‌కు, మన్నెగూడ నుంచి తాండూరు రోడ్లు విస్తరణ కూడా చేపట్టాలని మంత్రి, ఎమ్మెల్యే కోరారు. దీనికి గడ్కారీ సానుకూలంగా స్పందించి ఈ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉప్పల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ రోడ్ల నిర్మాణాల విషయంలో కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించడం సంతోషకరమని, త్వరలోనే స్థానిక ప్రజల కష్టాలు తీరతాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.

సర్పంచ్ పదవి కీలకమైనది

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పదవీకాలం ముగియడంతో పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా సన్మానం


కందుకూరు : సర్పంచ్‌లను సన్మానిస్తున్న జంగారెడ్డి, సత్యనారాయణ, కృష్ణానాయక్

కొత్తూర్, ఫిబ్రవరి 1: గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్ పదవి ఎంతో కీలకమైందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులకు గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైనారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ఎంపీవో విజయలక్ష్మి, ఎంపీటీసీలు, అధికారులున్నారు.

ఆమనగల్లు/కడ్తాల: ప్రజాప్రతినిధులకు విరమణ పదవులకే తప్ప ప్రజాసేవకు కాదని కేఎస్‌ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ అన్నారు. మేడిగడ్డ జీపీ కార్యాలయంలో సర్పంచ్ అమర్‌సింగ్, ఉప సర్పంచ్ మల్లేశ్‌నాయక్, వార్డుసభ్యులను విజయ్‌రాథోడ్ ఆధ్వర్యంలో అభినందన, సన్మాన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి వెంకటయ్య, నాయకులు జయరామ్, సిద్రామ్, తదితరులున్నారు. చెన్నంపల్లి జీపీ కార్యాలయంలో


కొత్తూర్ : సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

సర్పంచ్ శ్రీనయ్య, ఉపసర్పంచ్, వార్డుసభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లిలో పంచాయతీ పాలకవర్గాన్ని రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు జోగు వీరయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ జంగం సుగుణసాయిలు, ఉపసర్పంచ్ ముత్యాలు, వార్డుసభ్యులను ఎంపీటీసీ ఉమావతితో కలిసి సన్మానించారు. మైసిగండిలో సర్పంచ్ తులసీరామ్, ఉపసర్పంచ్ రాజారామ్, వార్డుసభ్యులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, నాయకులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో వెల్జాల రైతువేదికలో సర్పంచ్ సంగీత, ఉప సర్పంచ్ అజీజ్, వార్డుసభ్యులతో పాటు మండలంలోని 8మంది సర్పంచ్‌లకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్‌యాదవ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాలకవర్గాలను సత్కరించి కొనియాడారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రవి, కార్యదర్శి శరత్‌కుమార్, వార్డు సభ్యులు యాదయ్య, శ్రీను, విజయ్‌కుమార్, పెంటయ్యగౌడ్, జంగయ్య, అంజిరెడ్డి, రాజు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి : ఐదేళ్లుగా గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రజలకు, వార్డు సభ్యులకు రుణపడి ఉంటానని మిర్జాగూడ సర్పంచ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచ్ రవీందర్‌గౌడ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఉపసర్పంచ్ శాంతి, వార్డు సభ్యులు రాజుగౌడ్, శివయాదవ్ తదితరులున్నారు.

కేశంపేట : చౌలపల్లి జీపీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ పాలకవర్గంను గ్రామస్తులతో పాటు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సర్పంచ్ వీరేశ్, తహసీల్దార్ అజాంఅలీ, తదితరులున్నారు.

కందుకూరు : సర్పంచ్ పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజాసేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుండాలని పీసీసీ సభ్యులు జంగారెడ్డి కోరారు. దెబ్బడగూడ, కందుకూరు గ్రామాల సర్పంచ్‌లు(కాంగ్రెస్) ఏనుగు శ్రావణి, సురసాని శమంతకమణిలను పార్టీ నేతలతో మండల కేంద్రంలో సన్మానించారు.


తలకొండపల్లి : వెల్జాల్‌లో సర్పంచ్ సంగీత, పాలకవర్గం సభ్యులను సన్మానిస్తున్న సీఎల్ శ్రీనివాస్


శంకర్‌పల్లి : రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కురుమ వెంకటేష్, తదితరులు


కేశంపేట : సన్మాన కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు


ఆమనగల్లు : మేడిగడ్డలో సర్పంచ్ అమర్‌సింగ్, పాలకవర్గాన్ని సన్మానిస్తున్న తండా నాయకులు

చరిత్రలో గుర్తుండిపోయేది సర్పంచ్ పదవి

కందుకూరు : సర్పంచ్ పదవి చరిత్రలో గుర్తుండిపోయేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆమె మీడియాలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మానస పుత్రిక 'పల్లె ప్రగతి'తో పల్లెలను తీర్చిదిద్దిన యోధులు సర్పంచ్‌లని అన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం దిశగా ముందుకుసాగినట్లు చెప్పారు. పదవీకాలం పూర్తిచేసుకుంటున్న సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, గ్రామ కో-ఆర్డినేటర్లను సబితారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి

చేవెళ్ల, ఫిబ్రవరి 1 : బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నగూడ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామానికి చెందిన కావలి గోపాల్(52) వ్యవసాయ కూలీ. గురువారం సాయంత్రం చేవెళ్లకు వచ్చి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలోని రామన్నగూడ గ్రామం వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి బోల్తాపడటంతో తలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కమే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చేవెళ్ల, ఫిబ్రవరి 1 : పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసిన ఘటన గురువారం సాయంత్రం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చనువల్లి గ్రామం పరిధిలో ఉన్న పంట పొలాల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.5,642 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీ

- బాధితులకు అప్పగించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1 : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించబడిన 15 సెల్‌ఫోన్లను పోలీస్ అధికారులు రికవరీ చేసి గురువారం బాధితులకు అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఈఎంఐఈలను సీఈఐఆర్ అప్లికేషన్‌లో ఎంట్రీచేసి దర్యాప్తు చేసి నిందితుల నుంచి రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. కాగా, ఈ సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. ఎస్సై మారయ్యతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

5 నుంచి మీరాపూర్ దర్గా ఉత్సవాలు



షాబాద్, ఫిబ్రవరి 1 : ఈనెల 5 నుంచి 6 వరకు మండల పరిధిలోని మీరాపూర్ దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెన్నాబాయి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 5, 6వ తేదీల్లో దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీ సాయంత్రం కవాలి జరుగుతుందన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడానికి రాజకీయ నాయకులు వస్తున్నట్లు చెప్పారు.

'మలయాళస్వామి' ఆస్తులను పరిరక్షిస్తాం

షాద్‌నగర్, ఫిబ్రవరి 1 : మలయాళ స్వామి ఆశ్రమానికి సంబంధించిన ఆస్తులను పరిరక్షించి, ఆశ్రమ విశిష్టతను కాపాడుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని మలయాళ స్వామి ఆశ్రమంలో ఆశ్రమానికి సంబంధించిన ఆస్తుల వివాదానికి సంబంధించి ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు, వీహెచ్‌పీ నేత బండారి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమానికి చెందిన ఆస్తులను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధూప దీప నైవేద్యం, నిత్యాన్నదానం కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని నిర్వాహకులకు సూచించారు. కాగా, ఆశ్రమానికి సంబంధించి కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఆశ్రమ ఆస్తులకు సంబంధించి నిర్వాహకుడు నిత్యానందస్వామి వాటిని సొంతం చేసుకునేందుకు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ప్రయత్నాలు చేపట్టారు. దాంతో పట్టణ ప్రముఖులతో పాటు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బక్కని నర్సింహులు ఆశ్రమ స్థల దాత కుమారుడు పలబట్ల పాండురంగయ్య ఆశమానికి సంబంధించిన ఆస్తులు ఇతర వ్యక్తులపై మార్పిడి జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వారు కేటాయించిన స్థలాన్ని ఆశ్రమానికి మాత్రమే చెందేలా చర్యలు చేపట్టారు. అయినా వివాదం సద్దుమణగలేదు. దీంతో ఎమ్మెల్యే జోక్యం కల్పించుకుని ఆశ్రమ ఆస్తుల వివాదాన్ని ఒక కొలిక్కి తేవడం గమనార్హం.

దేశానికి వెన్నుముక ఆర్మీ జవానులు


కొందుర్గు : చంద్రశేఖర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు : దేశానికి వెన్నుముక ఆర్మీ జవానులేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గతేడాది ఆగస్టులో లద్దాఖ్‌లోని బేరి ప్రాంతంలో ఆర్మీ వాహనం లోయలోపడిన ప్రమాదంలో తంగళ్ళపల్లి శివారు గ్రామం తిర్మన్‌దేవునిపల్లికి చెందిన జవాన్ నీరటి చంద్రశేఖర్(30) మృతి చెందారు. గురువారం తిర్మన్‌దేవునిపల్లిలో చంద్రశేఖర్ విగ్రహాన్ని ఆర్మీ అధికారులు, కుటుంబసభ్యులు ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే, చంద్రశేఖర్ కుటుంబసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. పాలమూరు ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వీర జవాన్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు సమాజం కూడా అండగా ఉండాలని కోరారు. చంద్రశేఖర్ స్నేహితులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, బాబయ్య, రాములు, శ్రీనివాస్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి 'బీఆర్‌ఎస్ డైరెక్టర్లు'


ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న పీఏసీఎస్ డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1 : ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన బీఆర్‌ఎస్ బలపరిచిన డైరెక్టర్లు కె.చంద్రశేఖర్‌రెడ్డి, గుర్రం సుధాకర్‌రెడ్డి, సుబ్బురు జంగయ్య, మేడిపల్లి పుల్లయ్య, బొమ్మకంటి అశోక్‌లు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సొసైటీ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ క్యామ శంకర్‌పై మెజారిటీ డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుమతివ్వాలంటూ కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన ఆరుగురు డైరెక్టర్లతోపాటు ఈ ఐదుగురు డైరెక్టర్లు కలిసి సంతకాలు చేసిన ప్రతిని బుధవారం డీసీవోకు ఇచ్చిన విషయం తెలిసిందే.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత


ఆదిభట్ల : అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆదిభట్ల/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1 : బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పలువురు చేపట్టిన అనుమతి లేని నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 59ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు పోలీసుల సహాయంతో ఉదయం నాలుగు గంటల నుంచి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా అనుమతి లేని నిర్మాణాలను తొలగించారు. క్రిమినల్ రికార్డులు ఉన్న 15మందిని ముందస్తుగా అరెస్టు చేశారు. తహసీల్దార్ మాధవిరెడ్డి, కమిషనర్ సుమన్‌రావు, ఆర్‌ఐలు జమీల్, ప్రశాంతి మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడలో సర్వే నెంబర్ 199లో అనుమతి లేని నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. తహసీల్దారు అన్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, పుష్పలత తమ సిబ్బందితో నిర్మాణాలను కూల్చివేశారు.

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ కళమ్మరాజు

కందుకూరు, ఫిబ్రవరి 1 : నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని మండల సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని ఆకులమైలారంలో సర్పంచ్ జి.కళమ్మరాజుతో కలిసి సీసీ కెమెరాలు ప్రారంభించారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన 32మందికి రూ.8వేల చొప్పున పరిహారం అందజేశారు. ఉపసర్పంచ్ రాంరెడ్డి, వార్డు సభ్యులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో 'ట్రాఫిక్ క్లియర్'

- జాతీయ రహదారిపై వాహనాలు, వ్యాపార ప్రకటనల బోర్డులు తొలగించిన పోలీసులు

శంషాబాద్, ఫిబ్రవరి 1 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపక్కన అనుమతి లేని స్థలాల్లో పార్కుచేసిన వాహనాలతో పాటు వ్యాపార ప్రకటనలకు సంబంధించిన బోర్డులను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు, దుకాణదారులు తప్పకుండా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని, వ్యాపారస్తులు పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు.

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి సన్మానం



మంచాల, ఫిబ్రవరి 1 : త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఆరుట్ల గ్రామానికి చెందిన బీజేపీ నేతలు గురువారం ఇబ్రహీంపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాండాలజంగయ్య, కొంగర జనార్థన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నూకం రాజు, గంట నర్సింహారెడ్డి, వెదటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. మహిళలకు మీరిచ్చే గౌరవం ఇదేనా?

- జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ

కొత్తూర్, ఫిబ్రవరి 1: ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలలో ప్రోటోకాల్ పాటించకుండా షాద్‌నగర్ ఎమ్మెల్యే మహిళా ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్నారని, మహిళ ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే ఇచ్చే గౌరవం ఇదేనా అని స్థానిక జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. పూజా కన్వెన్షన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎస్‌బీపల్లిలో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారని, దానికి గత ప్రభుత్వంలో జడ్పీ నిధులు రూ.10లక్షలు మంజూరు చేయించామని, టెండర్ కూడా పూర్తయిందని చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీకి ఆహ్వానం లేకుండా కేవలం సర్పంచ్‌తో కలిసి శంకుస్థాపన చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తన స్వగ్రామమైన ఎస్‌బీపల్లిలో సమాచారం ఇవ్వకుండా ఎలా శంకుస్థాపన చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఒక న్యాయం, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. వైస్‌చైర్మన్ రవీందర్, సర్పంచులు తులసమ్మబాలయ్య, సత్తయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణ, తదితరులున్నారు.

కోదండరామ్‌పై వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 1 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యావత్ తెలంగాణ ప్రజానికాన్ని ఏకం చేసిన ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవడం శోచనీయమని తెలంగాణ జేఏసీ నాయకులు విమర్శించారు. ఆయనపై వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో నాయకులు ఎం జనార్ధన్, టీజీ శ్రీనివాస్, అర్జునప్ప, బాలరాజ్, కరుణాకర్, టెలిఫోన్ వెంకటయ్య, రాము గోర్ల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేయడంతో పాటు, విద్యా, ఉద్యోగ, కార్మిక సంఘాలను ఉద్యమంలో పాల్గొనేలా చేసి తెలంగాణ సాధనలో కీలకంగా పని చేసిన వ్యక్తి కోదండరాం అని కొనియాడారు. బీఆర్‌ఎస్ నేతలు ఓర్వలేక కోదండరాంను ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు.

జీవజాతుల రక్షణతోనే పర్యావరణ సమతుల్యం సాధ్యం

- పశు వైద్యురాలు డాక్టర్ ప్రసన్న

షాద్‌నగర్, ఫిబ్రవరి 1 : జీవ జాతులను కాపాడటంతోనే పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని, మానవ మనుగడకు జీవ జాతులు ఎంతో దోహదం చేస్తాయని పశువైద్యురాలు డాక్టర్ పి ప్రసన్న అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జనవరి 16 నుంచి 31వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలను నిర్వహించామన్నారు. విద్యార్థులకు జీవ జాతుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి జీత జాతుల ఆవశ్యకత గురించి వివరించామని తెలిపారు. జంతువులను కొట్టడం, హింసించడం లాంటి చర్యలకు పాల్పడవద్దని, వీధికుక్కల పట్ల జాగ్రత్తగా వ్యవహించాలన్నారు. గోవధచట్టం ప్రకారం ఆవులు, ఎద్దులు, లేగలను వధించడం నిషేధించారని, చట్టాన్ని అతిక్రమంచి గోవధచేస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


సురేఖను కలిసిన కాంగ్రెస్ నాయకులు

యాచారం, ఫిబ్రవరి 1 : మండలంలోని ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను బుధవారం కాంగ్రెస్ మండల నాయకులు మస్కు నర్సింహ, వరికుప్పల తిరుమలేష్ తదితరులు కలిసి కోరారు. మంత్రిని ఆమె నివాసంలో కలిసి దేవాలయాల దుస్థితిని వివరించారు. అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని నిధులు విడుదలకు చొరవ తీసుకుంటానని మంత్రి తెలిపినట్లు చెప్పారు. రాజేందర్‌నాయక్, శివలింగాచారి తదితరులు మంత్రిని కలిశారు.

మైక్రోసాఫ్ట్ సేవలు అభినందనీయం

షాబాద్, ఫిబ్రవరి 1 : క్రీడా ప్రాంగణం సుందరీకరణకు ముందుకు వచ్చిన మైక్రోసాఫ్ట్ సేవలు అభినందనీయమని చందన్‌వెళ్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చందన్‌వెళ్లి క్రీడా మైదానంలో యునైటెడ్‌వే హైదరాబాద్ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ పరికరాలు, మైదానం సుందరీకరణ చేసి మొక్కలు నాటారు. ప్రతినిధులు శ్రీచందన, అజిత్, మాజీఉపసర్పంచ్ ప్రమీల, గ్రామస్తులు తదితరులున్నారు. అనంతరం సర్పంచుల పదవీకాలం ముగియడంతో జీపీ ఆవరణలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు.


మొక్కలు నాటుతున్న మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, గ్రామస్తులు

బైక్‌రైడింగ్ చాంపియన్‌కు మంత్రి అభినందన


విగ్నేష్‌గౌడ్‌ను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆమనగల్లు, ఫిబ్రవరి 1 : జాతీయ బైక్‌రైడింగ్‌లో చాంపియన్‌షిప్ సాధించిన పాలకుర్ల విగ్నేష్ గౌడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ బైక్‌రైడింగ్‌లో పాల్గొని చాంపియన్‌షిప్ సాధించాడు. గురువారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పొన్నంను మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్‌గౌడ్‌తో కలిసి విగ్నేష్‌గౌడ్‌ను మంత్రి అభినందించారు.

చనిపోయినా మరొకరికి 'కంటిచూపు'

- వృద్ధురాలి నేత్రదానం.. గతంలో కళ్లదానానికి అంగీకారం



రుక్కమ్మ(ఫైల్)

చేవెళ్ల, ఫిబ్రవరి 1 : తాను చనిపోతున్నప్పటికీ.. ఈ లోకంలో మరొకరికి కంటి చూపునిచ్చేందుకు గణపతి రుక్కమ్మ(80) అనే వృద్ధురాలు నేత్రదానం చేసిన ఘటన ఇక్కరెడ్డిగూడ గ్రామంలో జరిగింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రుక్కమ్మ బుధవారం రాత్రి అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందింది. నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ గతంలో సంబంధిత పత్రాలపై ఆమె సంతకం చేశారు. ఆమె కుమారులు రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి నగరంలోని ఆసుపత్రి వైద్యులకు సమచారం అందించగా గ్రామానికి చేరుకొని ఆమె నేత్రాలను సేకరించి తీసుకెళ్లారు. గ్రామంలో ఇప్పటికి వరకు 15మంది నేత్రదానం చేశారని గ్రామ యూత్ అధ్యక్షుడు గణపతి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బస్టాప్‌ను వెంకటేశ్వర కాలనీకి మార్చాలి

మంచాల, ఫిబ్రవరి 1 : ఆరుట్ల గ్రామపంచాయతీ వద్ద గల బస్టాప్‌ను స్థానికంగా ఉన్న వెంకటేశ్వర కాలనీకి మార్చాలని మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను కోరారు. గురువారం గ్రామస్తులతో కలిసి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాపును వెంకటేశ్వరకాలనీకి మార్చడం వల్ల ప్రజలకు, డ్రైవర్లకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మాజీసర్పంచ్ యాదయ్య, గుడ్డిమల్ల చంద్రయ్య, సురేష్ ఉన్నారు.

తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకం


మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వాన పత్రం ఇస్తున్న నాయకులు

షాబాద్, ఫిబ్రవరి 01 : ప్రత్యేక తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఉద్యమకారుల సంఘం నాయకులు నగరంలో స్పీకర్, మంత్రిని వారి నివాసాల్లో కలిసి ఈ నెల 4న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరఫున కృతజ్ఞత సభకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, ఉద్యమకారుల ఫోరం పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, ఉద్యమకారుల ఫోరం షాబాద్ మండలాధ్యక్షుడు చెన్నయ్య, చేవెళ్ల అధ్యక్షుడు మల్లేష్, మొయినాబాద్ అధ్యక్షుడు మైపాల్, జేఏసీ నాయకులు సత్యానందం, సంపత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 1 : రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు శిరీష గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు, మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కి రెండు నెలలవుతున్నా రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సంక్షిప్తంగా..

- **మొయినాబాద్ రూరల్ :** లాభార్జనే ధ్యేయంగా కాకుండా వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ యువతకు సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో వికారాబాద్ ప్రాంతానికి చెందిన పబ్బె శ్రీనివాస్ నూతనంగా ఏర్పాటు చేసిన జంక్షన్ ఫుడ్ కోర్టును ప్రసాద్‌కుమార్ గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, మండలాధ్యక్షుడు మాణెయ్య, పురాణం వీరభద్రస్వామి, పార్టీ సీనియర్ నాయకుడు, లీగల్‌సెల్ కన్వీనర్ బైకని కుమార్ యాదవ్, ఎంపీటీసీ రాంరెడ్డితో పాటు హోటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.
- **షాద్‌నగర్‌రూరల్ :** ఫరూఖ్‌నగర్ మండలంలోని నాలుగు దేవాలయాలకు ధర్మకర్తల మండలికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఎలికట్ట ఆంజనేయ స్వామి, దేవునిపల్లి వేణుగోపాల స్వామి, చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి, వెలిజర్ల సీతారామచంద్రస్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ నెల 10 వరకు హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.
- **షాద్‌నగర్‌రూరల్ :** మహాశివరాత్రికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రామలింగేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఈవో శివకుమార్ తదితరులు ఉన్నారు.
- **కందుకూరు :** సమాజ సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలని కొత్తగూడ సర్పంచ్ మల్లారెడ్డి కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్లాంట్స్ లిపిడ్స్ కంపెనీ యాజమాన్యం ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.75వేల విలువ గల టీవీని వితరణ చేయగా సర్పంచ్ ప్రారంభిచారు. మండల విద్యాధికారి మనోహర్, ప్లాంట్స్ లిపిడ్ కంపెనీ సభ్యులు, సిబ్బంది, నాయకులు ఉన్నారు.
- **చేవెళ్ల :** ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వేణుగోపాల్‌రావును నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.
- **మొయినాబాద్ రూరల్ :** ఐదేళ్ల సర్పంచ్ పదవీకాలంలో గ్రామానికి ఎంతో సేవ చేసినట్లు హిమాయత్ నగర్ సర్పంచ్ ముదిగొండ మంజుల తెలిపారు. జీపీ కార్యాలయంలో ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై కార్యదర్శి సంధ్యతో కలిసి సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి అనుమతులు ఇచ్చారు. అలాగే ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజ్ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, నాయకులు రవియాదవ్, వార్డు సభ్యుడు మాల యాదయ్య, సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, యాదయ్య తదితరులు ఉన్నారు.
- **యాచారం :** బెల్టుదుకాణాలతో బతుకులు పాడవుతున్నాయని, వాటిని మూయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి మండలంలోని నందివనపర్తి గ్రామంలో యువకులు ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసి వేయాలని, బెల్టు దుకాణాలు నడిపిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రచారం చేశారు.
- **ఆమనగల్లు :** జనవిజ్ఞాన వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీలలో మండలంలోని 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 11 టీంలు పాల్గొన్నాయి. 8 నుండి 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పోటీలను జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి. రాములయ్య ప్రారంభించారు. అలాగే కడ్తాల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్ష పత్రాన్ని ఎంఈవో సర్దార్‌నాయక్ విడుదల చేశారు. మండల పరిధిలోని 9 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.
- **తలకొండపల్లి :** సమాజంలో శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహద పడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ లలితజ్యోతయ్య ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోట మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గోలి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఎంపీటీసీ హేమ రాజు, ఉపసర్పంచ్ పద్మ అనిల్, నాయకులు తదితరులున్నారు.